# 4

# యేసు సంరక్షింపబడుట

## (2:13-23)

"శిశువును" సురక్షితముగా కాపాడుట గూర్చిన సంభ్రమాశ్చర్యములను కలిగించు కథలో యోసేపు మరియు శిశువు యేసుతో కూడా పయనించి ఐగుప్తునకు వెళ్లి, ఇశ్రాయేలు తిరిగి వచ్చుట గూర్చి దేవదూతలు చేత ఆదేశింపబడువరకు అచ్చటనే ఎలా నిలిచియుండిరో, మత్తయి మనకు తెలియజెప్పాడు.

### ఐగుప్తుకు పారిపోవుట (2:13-15)

**[13]వారు వెళ్లిన తరువాత ఇదిగో ప్రభువు దూత స్వప్నమందు యోసేపునకు ప్రత్యక్షమై హేరోదు ఆ శిశువును సంహారింపవలెనని ఆయనను వెదకబోవుచున్నాడు గనుక నీవు లేచి ఆ శిశువును ఆయన తల్లిని వెంటబెట్టుకొని ఐగుప్తునకు పారిపోయి, నేను నీతో తెలియజెప్పువరకు అక్కడనే యుండుమని అతనితో చెప్పెను. [14-15]అప్పుడతడు లేచి, రాత్రి వేళ శిశువును తల్లిని తోడుకొని, ఐగుప్తునకు వెళ్లి,**

**ఐగుప్తులోనుండి నా కుమారుని పిలిచితిని**

**అని ప్రవక్తద్వారా ప్రభువు సెలవిచ్చిన మాట నెరవేర్చబడునట్లు హేరోదు మరణమగువరకు అక్కడనుండెను.**

**వచనము 13**. జ్ఞానులు నిష్క్రమించిన తరువాత, **యోసేపు** మరియను మరియు శిశువైన యేసును తిసుకొని **ఐగుప్తుకు పారిపోవలెనని దూత** చేత **స్వప్నమందు** హెచ్చరింపబడెను. ఇలా వెళ్లిపొమ్మనడంలో గల ఉద్దేశమేమనగా ఈ కుటుంబమునకును హేరోదునకును నడుమ సాధ్యమైనంత ఎడమను, కనీసము వారు హేరోదు అధికార పరిధిలో లేకుండునట్లు తగు జాగ్రత్త వహించుటయే. ఐగుప్తు దేశము సరిహద్దు బేత్లెహేము నుండి యించుమించు డెబ్బదియైదు మైళ్ల దూరము వరకు విస్తరించి యుండెను. అయితే హేరోదు అధికార పరిధి ఐగుప్తు యొక్క నది వరకు మాత్రమే. అది డెల్టా ప్రదేశమునకును నైలు నదికిని యింకా దాదాపు 125 మైళ్ల దూరంలో ఉండెను.

ఐగుప్తు, ఆ సమయంలో రోమా సామ్రాజ్యములో ఒక ప్రదేశమై యుండినది, అత్యధిక సంఖ్యలో యూదీయా ప్రజల జనాభాతోపాటు, అనేక సమాజమందిరములను సహితము కలిగియుండినది (అపొస్తలుల కార్యములు 2:5, 10; 6:9; 18:24 చూడుము). ఫిలో, ఐగుప్తులోని అలెగ్జాండ్రియాలో నివసించుచుండిన ఒక యూదీయ తత్త్వవేత్త మరియు, ఆ రోజుల్లో ఐగుప్తులో సుమారు ఒక లక్ష వరకు యూదులు నివసించుచుండిరని, దాదాపు క్రీ.శ. 40లో రచించాడు.[1] ప్రాచీన ప్రపంచంలోని గ్రంథాలయములలో అతి పెద్దదైన ఒక గ్రంథాలయము ఐగుప్తులో నెలకొల్పబడి యుండినది, సెప్టుజింట్ (LXX) అనువదింపబడినది ఇక్కడే. యోసేపు ఐగుప్తుకు వెళ్లుట ద్వారా ఆయన తన సొంత

ప్రజలనేకుల మధ్య ఉంటూ, హేరోదు ఆయనను సమీపించలేనంత దూరములో ఉండెను. బైబిలు సంబంధమైన రికార్డుల ప్రకారము, యేసు ఆయన జీవితకాలమంతటిలో పాలస్తీనకు వెలుపల ఉండినది కేవలము ఇదొక్కసారే.

వారు తిరిగి వెళ్లుటకు అది క్షేమకరమైన సమయమని దేవుడు ఆయనకు బయలుపర్చునంత వరకు ఆయన ఐగుప్తులోనే **నిలిచియుండవలెనని** యోసేపుకు ఆ తరువాత మరిన్ని ఆదేశములివ్వబడినవి. సరికదా, వారు వెళ్లవలసియుండిన కారణము కూడ ఆయనకు తెలియజెప్పబడినది: **ఆ శిశువును సంహరింపవలెనని ఆయన కొరకు హేరోదు వెదకుబోవుచున్నాడు.**

**వచనములు 14, 15.** అదనపు ముందుజాగ్రత్తగా, **యోసేపు** మరియు తన కుటుంబము **ఐగుప్తుకు రాత్రివేళ వెళ్లారు**. స్వప్నమందు ఆయనకివ్వబడిన ఆదేశాల మేరకు ఆయన తీసికొనవలసిన చర్యను యోసేపు వెంటనే చేపట్టాడని భాష సూచించుచున్నది; యోసేపు ఎడతెరపిలేకుండా దేవునికి లోబడుచున్నట్లు స్పష్టమగుచున్నది (1:18–25; 2:13–15, 19–23). "ఈ చిన్న కుటుంబము పేద కుటుంబమై యున్నదని స్పష్టమగుచున్నది, గనుక ప్రయాణము కొరకు వేగిరముగా సిద్ధపడుటకు వారు సర్దుకొనాల్సిన వస్తుసామగ్రి ఎక్కువగా ఉండదనియు, స్వప్నము ద్వారా వారు తొందరపాటుగా తరలివెళ్లాల్సిన ఆవశ్యకతను యోసేపు అర్థంచేసికొన్నాడనియు" లియోన్ మోర్రిస్ గమనించుచున్నాడు.[2]

**హేరోదు మరణమగునంత వరకు** యోసేపు కుటుంబము ఐగుప్తులోనే **నిలిచియుండినది.** చరిత్ర ప్రకారము, హేరోదు క్రీ.పూ. 4లో మార్చి మాసము చివరి రోజుల్లో లేదా ఏప్రిల్ మాసము తొలి రోజుల్లో మరణించాడు (2:19పై గల వ్యాఖ్యానము చూడుము). యోసేపు కుటుంబము ఐగుప్తులో వాస్తవముగా గడిపిన సమయము చాలా స్వల్పకాలమైయుండును, బహుశా రెండు మాసములై యుండును.

యేసు ఐగుప్తుకు పారిపోవుట మరియు తదనంతరము తిరిగి వచ్చుట ప్రవక్తయైన హోషేయ పలికిన ప్రవచనము: **ఐగుప్తులో నుండి నా కుమారుని పిలిచితిని** యొక్క నెరవేర్పై యున్నదని మత్తయి వివరించాడు (హోషేయ 11:1). ఈ ప్రవచన పలుకులు ప్రప్రథమంగా దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి వెలుపలికి తీసికొని వచ్చిన సందర్భములో హోషేయకు తెలియజెప్పబడినవి (నిర్గమకాండము 12:40–51). ఛాయ మరియు రాబోవుచున్న ఛాయ పద్ధతిని ప్రయోగించుచు ఈ పలుకులను మత్తయి యేసుకు అన్వయించాడు. జే. డబ్ల్యు. మెక్‌గార్వే ఇలా వివరించుచున్నాడు, "ఈ మాటలను యేసుకు అన్వయించుట ద్వారా మత్తయి ఇశ్రాయేలు ఐగుప్తులోనికి ప్రవేశించుట మరియు అచ్చట నుండి వెడలిపోవుటను, యేసు ఐగుప్తుకు వెళ్లి తిరిగి వచ్చిన అవే కదలికలను మాదిరిగా చేయుచున్నాడు."[3]

ఇశ్రాయేలు నిర్గమము మరియు యేసు నిర్గమును "విమోచనా చరిత్ర యొక్క రెండు క్షణాలై యున్నవని" డోనాల్డ్. ఏ. హేగ్నర్ ప్రస్తావించాడు. "ఈ రెండును ఒకదానితో మరొకటి ముడిపడియున్నవిగా, ఒక బృహత్ ప్రణాళిక యొక్క కొనసాగింపును రూపుదిద్దుకొనుచున్నవిగా పరిగణింపబడియున్నదని" ఆయన చెప్పాడు.[4] కాబట్టి, యేసు ఇశ్రాయేలు యొక్క శ్రమలను మరియు విజయములను పంచుకొనునట్లు చిత్రీకరింపబడ్డాడు. ఈ రెండు సందర్భాల్లోను, మార్గనిర్దేశనము నిచ్చువాడును, కాపాడువాడును దేవుడే అయియున్నాడని తెలియుచున్నది.

హోషేయ యొక్క ప్రకటన గూర్చి డగ్లస్ ఆర్. ఏ. హేర్ ఈ దివ్యమైన లోచూపుగల వ్యాఖ్యానములను తెలియజెప్పుచున్నాడు (హోషేయ 11:1):

> … అది ముందువెనుకలు ఆలోచించినది. యేసు రాకడలో ఒక నూతన ఆరంభమున్నట్లు [1:1, 18], ఒక నూతన నిర్గమము యొక్క అసంపూర్ణతను సూచించుచున్నాడు: "నేను ఎంత ఎక్కువగా వారిని పిలుస్తూ వుంటే, వారు నాకు అంత దూరంగా వెళ్లిపోయారు; వారు బయలుదేవతలకే బల్యర్పణలు గావించుచు వచ్చారు, విగ్రహముల యెదుట ధూపము వేయుచున్నారు" (హోషయ 11:2). యేసు తన సొంత మూర్తిమంతములో ఇశ్రాయేలుకు ప్రాతినిధ్యం వహించుచున్నాడు, కానీ ఒక విశిష్టమైన విధానములో, తన విధేయత ద్వారా, ఇశ్రాయేలు యొక్క అవిధేయతకు వ్యతిరేకముగా ఏర్పాటుచేయబడి, "నా కుమారుడు" అని దేవుని చేత పిలువబడుటకు ఆయన మాత్రమే అర్హుడై యున్నాడు.[5]

## హేరోదు ఆగ్రహము (2:16–18)

**16 ఆ జ్ఞానులు తన్ను అపహసించిరని హేరోదు గ్రహించి బహూ ఆగ్రహము తెచ్చుకొని, తాను జ్ఞానులవలన వివరముగా తెలిసికొనిన కాలమునుబట్టి, బేత్లెహేములోను దాని సకల ప్రాంతములలోను, రెండు సంవత్సరములు మొదలుకొని తక్కువ వయస్సుగల మగపిల్లల నందరిని వధించెను. 17 అందువలన**

**–రామాలో అంగలార్పు వినబడెను**
**ఏడ్పును మహారోదన ధ్వనియు కలిగెను**
**18 రాహేలు తన పిల్లల విషయమై యేడ్చుచు వారు**
**లేనందున ఓదార్పు పొందనొల్లక యుండెను**

**అని ప్రవక్తయైన యిర్మీయా ద్వారా చెప్పబడిన వాక్యము నెరవేరెను.**

**వచనము 16. జ్ఞానులు ఆయనను టక్కరితనంతో వంచించారు** గనుక వారు ఎలాగైనా యిక తిరిగి యెరూషలేముకు రారని **హేరోదు** గ్రహించినప్పుడు, బహు ఆగ్రహము తెచ్చుకొనెను. "టక్కరితనముతో వంచించుట" అను పదమునకు సమానార్థమిచ్చు గ్రీకు పదము (*empaizō*), ఒకరిని అపహసించుట లేక ఎగతాళిచేయుట అను అభిప్రాయమును కలిగించుచున్నది. వాస్తవమునకు హేరోదును వంచించివలెననునది జ్ఞానుల ఉద్దేశము కానప్పటికిని, వారు ఆయన వారికిచ్చిన ఆజ్ఞను ధిక్కరించుట ద్వారా ఆయనను ఎగతాళి చేయుచున్నారని అనువదించుకొన్నాడు (2:8, 12 చూడుము). హేరోదు తన భావోద్రేకముల అదుపు తప్పాడు. ఆయన ఎగతాళి చేయబడుచున్నాడని తాననుకొనినప్పుడు, ఆయన కోపము అత్యాగ్రహముగా పొంగినది గనుక ఆయనను మోసంచేసిన వారిపై పగతీర్చుకొనవలెనని అతడాతురపడ్డాడు. అయన అణగిమణగియున్న ఆగ్రహమును జ్ఞానులపై వ్యక్తపరచలేకపోయాడు, ఏలయనగా వారు తప్పించుకొని మరొక మార్గమున వెళ్లిపోయారు; గనుక హేరోదు సమాజములోని అత్యంత అమాయకులైన వారి వైపు, **రెండు సంవత్సరములు మొదులుకొని తక్కువ వయస్సున్న పసి బాలుర వైపు** మళ్లాడు. ఆయన ప్రత్యేకంగా ఈ వయస్సునే ఆయన ఎందుకు ఎన్నుకొన్నాడు? జ్ఞానులు నక్షత్రమును మొదటిసారి చూచిన సమయము ప్రకారము, అప్పటికి శిశువు (యేసు) వయస్సు ఎంత ఉంటుందో ఆయన అంచనా వేశాడని వాక్యభాగము మనకు తెలియజెప్పుచున్నది (2:7). సరైన శిశువు సంహారింపబడుచున్నాడని రూఢిపర్చుకొనుటకు

ఈ కాలమునకు ఆయన యింకా కొంచెము సమయమును కలిపియుండవచ్చును.

**బేత్లెహేము** మరియు దాని చుట్టుప్రక్కల ఉండిన ప్రాంతములలో గల **మగ శిశువులందరు** వధింపబడవలెనని హేరోదు ఆజ్ఞాపించాడు. ఈ ఆజ్ఞ శిరసావహింపబడినది. ఒక్క శిశువును వధించుట సహితము విషాదాంతమైన విషయమై యుండగా, వాస్తవమునకు మనము సర్వసాధారణంగా ఊహించుకొను సంఖ్యకంటే తక్కువమందే వధింపబడి యుందురు. బేత్లెహేము ఒక చిన్న పట్టణమై యుండినది, ఆ సమయంలో అక్కడ నివసించుచుండిన జనాభా ఎంతో మనకు ఖచ్చితంగా తెలియకపోయినప్పటికిని, పది నుండి ఇరవై వరకు శిశువులు వధింపబడి యుందురని కొందరు ఉజ్జాయింపుగా ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకొందురు. ఇంత గొప్ప పాశవికమైన పని ఆనాటి జోసీఫస్ వంటి ఇతర చరిత్రకారులు చేత ఎందుకు పేర్కొనబడలేదు? వధింపబడిన శిశువుల సంఖ్య కొంతమంది అనేది మొదటి సాధ్యమైన సమాధానమై యున్నది. హేరోదు చేసిన దురగాతములన్నింటి దృష్ట్యా, బేత్లెహేమునకు సమీపమున గల స్థలములలో నున్న ప్రజలు ఈ విషయమును ఎవరు గుర్తించలేకపోయారనునది రెండవ కారణమై యుండగలదు.

హేరోదు దేవుని యెడల కనుపర్చిన తన ధిక్కారములో మొండితనముతో సిగ్గుమాలినవాడై యుండెను. ఇదే కథలో ఇంతకు మునుపు, "క్రీస్తు ఎక్కడ పుట్టును?" అని ఆయన యూదుల నాయకులను అడిగాడు (2:4). హేరోదు అంతమొందించుటకు ప్రయత్నించుచుండినది, ఈ మెస్సీయానే, దేవుని చేత అభిషేకింపబడినవాడైన ఈయననే! హేరోదును ఫరో రాజుతో, ఐగుప్తులో ఇశ్రాయేలీయులకు జన్మించిన మగ శిశువులనందరిని హతమార్చుటకు ప్రయత్నించిన వానితో, పోల్చవచ్చును (నిర్గమకాండము 1:15, 16, 22). ఏదిఏమైనా, నీతిమంతులైన అతని తల్లిదండ్రుల ద్వారా దేవుడు మోషేను కాపాడెను (నిర్గమకాండము 2:1–10; హెబ్రీయులకు 11:23) – దేవుడు యేసును కాపాడి సంరక్షించుటకు ఆయన తల్లిదండ్రులైన యోసేపును మరియు మరియను కూడ ఇదే విధంగా వాడుకొన్నాడు.[6] ఈ రెండు సందర్భాల్లోను అమాయకులైన అనేక మంది శిశువులు మరణించినప్పటికిని, మోషే మరియు యేసు వారి ప్రజలను విడిపించుటకుగాను కాపాడి సంరక్షించబడ్డారు. యేసు విషయంలో, మెక్‌గార్వే ఇలా సూచించాడు, "సమస్త మానవుల రక్షణ కొరకు మరణించుటకు దైవసంకల్పము ప్రకారము నియమింపబడిన ఆయన క్షేమము కొరకు బేత్లెహేములోని శిశువులు మరణించారు."[7]

**వచనము 17. ప్రవక్తయైన యిర్మీయా ద్వారా చెప్పబడిన వాక్యము నెరవేరెను.** ఉద్దేశమును వ్యక్తము చేయుచు మత్తయి రాసిన సువార్తలోని నెరవేర్పు సూత్రములలో సాధారణంగా అగుపించుచుండు బలమైన రెండు సముచ్చయములు (*hina*) గాని (*hopōs*) గాని ఈ వచనములో లేవు. ఈ పదములను, "... ఇది చేయుటకు/జరుగునట్లు" అనియు వరసుగా అనువదింపవచ్చును. ASV అనువాదము ఈ పదజాలములుండు సముచ్ఛయములను, "*అది* నెరవేరునట్లు" వంటి ఇతర సూత్రములలో స్థిరముగా అనువదించుచుండును (1:22; 2:15, 23; 4:14; 8:17; 12:17; 13:35; 21:4; 26:56; నొక్కిచెప్పింది నాది). హేగ్నర్ యింకా ఇలా వివరించుచున్నాడు,

> ఏదో చెడును (ఇస్కరియోతు యూదా విద్రోహ చర్యకు సంబంధించిన సొమ్ము) సూచించుచున్న ఆసక్తికరమైన ఒకే ఒక ఇతర ఉల్లేఖనమై యున్న 27:9–10లో తప్ప, ఇతర సూత్రాలన్నియు

ఈ రెండింటిలో ఏదో ఒకదానిని కలిగియుండును. దేవుని ఉద్దేశముల విషయములో చెడును ఆపాదించుటకు మత్తయి అనిష్టపడుచున్నాడని ఇది ప్రతిబింబించున్నట్లు అగుపించుచున్నది. మత్తయి దృష్టికోణంలో, దేవుని సమకూర్పు సమస్తము ఆయన కృపాచిత్తము చొప్పున జరుగునట్లు చేయుటకు చెడును రద్దుచేయును.[8]

**వచనము 18.** యిర్మీయా 31:15లోని మాటలను మత్తాయి ఉల్లేఖించి చెప్పుచు, అమాయకులను వధించుటకును ప్రవక్త కాలములో సంభవించిన ఒక సంఘటనకును మధ్య గలు అనురూపమును ప్రదర్శించుచున్నాడు:

**రాహేలు తన పిల్లల విషయమై యేడ్చుచు వారు**
**లేనందున ఓదార్పు పొందనొల్లక యుండెను**
**అని ప్రవక్తయైన యిర్మీయా ద్వారా చెప్పబడిన వాక్యము నెరవేరెను.**

మత్తయి ఈ పదములను ఉపయెగించుట చిహ్నాత్మక శాస్త్రసంబంధముగా గాని (ఛాయగా/ముందు ఛాయగా) లేదా ప్రవచనము యొక్క ద్వంద్వ నెరవేర్పువలె గాని అర్థముచేసికొనబడవచ్చును.

"రామా," యెరూషలేమునకు దాదాపు ఐదు మైళ్ల దూరంలో ఉత్తర దిక్కున, బెన్యామీను భూభాగములో ఉండిన ఒక నగరమై యుండినది (యెహోషువా 18:25). ప్రస్తుత సందర్భశుద్ధి – "రాహేలు," "ఏడ్పు," మరియు "పిల్లలు" పేర్కొనబడుటతోపాటు – ఈ క్రింది వాస్తవములు ద్వారా విదితమగుచున్నది: (1) తన ప్రియాతిప్రియమైన సతీమణి రాహేలు ఒక కుమారుని కనుచు మరణించినప్పుడు బేత్లెహేము వెళ్లుటకు బేతేలు నుండి బయలుదేరిన యాకోబు మరియు తన కుటుంబము (రామాకు) దక్షిణ దిశగా పయనమై వెళ్లుచుండెను. ఆమె ఆ కుమారునికి "నా దుఃఖపుత్రుడు" అని అర్థమిచ్చు బెన్–ఓని అను నామకారణం చేసింది, అయితే యాకోబు ఆ పిల్లవానికి "[నా] కుడిచేతి పుత్రుడు" అని అర్థమిచ్చు "బెన్యామీను" అను పేరు పెట్టాడు. రాహేలు సమాధి రామాకు సమీపంలో నున్నది (ఆదికాండము 35:16–18; 48:7; 1 సమూయేలు 10:2). (2) ఇశ్రాయేలు దేశ భూభాగము విభజింపబడినప్పుడు బెన్యామీను వంశస్థులు యూదాతో నిలిచియుండిరి (1 రాజులు 12:21, 23). ఎట్టకేలకు వారు బబులోనీయుల[9] చేత చెరగా కొనిపోబడిరి (1:11పై గల వ్యాఖ్యానమును చూడుము) దేశబహిష్కరణ గావింపబడినందు వలన బబులోను దేశమునకు చెరగా పయనించి వెళ్లిన యూదులు అత్యధికంగా రాహేలు సమాధి ప్రక్కగా పయనించి యుందురు (యిర్మీయా 40:1). (3) వధింపబడిన లేదా చెరగా కొనిపోబడిన వారి పిల్లల గూర్చి అంగలార్చుచుండిన ఇశ్రాయేలు తల్లులకు ప్రాతినిధ్యం వహించు నిమిత్తము రాహేలు యిర్మీయా చేత ప్రతీకాత్మకమైన చిహ్నంగా ఉపయోగింపబడినది.

దేశబహిష్కరణనుబట్టి బబులోను దేశమునకు తరలివెళ్లుచుండిన తన పిల్లల కొరకు రాహేలు అంగలార్చుట, హేరోదు మహా రాజు తమ మగపిల్లలను వధించుచుండినప్పుడు బేత్లెహేములోని తల్లులు ఏడ్చిన ఏడ్పుకు చిహ్నమై యుండినది. జేమ్స్ ఈ. స్మీత్ ఇలా వ్యాఖ్యానిస్తున్నాడు, "రాహేలు అను నామము యొక్క అర్థము ('ఆడు గొఱ్ఱె') ప్రవక్త యొక్క వర్ణనకు బలమును చేకూర్చుచున్నది. రామాలో వ్యాఖ్యానిస్తున్నాడు, రామాలో (అక్షరాలా, పర్వతము పైన) దాని పిల్లల కొరకు అంగలార్చుచున్న ఆడు గొఱ్ఱె ఏడ్పును అతడు

ఆలకించుచున్నాడు."[10] మత్తయి ఉల్లేఖించి చెప్పుచున్న వాక్యభాగము, అది దుఃఖపూరితమైనదే అయినప్పటికిని, దాని నిర్మాణాత్మకమైన ముగింపునుబట్టి అది ఉపయోగింపబడినది. "ఈ దివ్యవాక్కు నూతన వాగ్దానముతో (యిర్మీయా 31:31-34) కూడ కలుపుకొనబడి, నిరీక్షణతో నిండియున్న అధ్యాయంలో ఏర్పడినది. రామాలోని దివ్యవాణి ఇటువంటి సాంగత్య సంబంధములకు పిలుపునివ్వవలెనని మత్తయి ఉద్దేశించుట సాధ్యమే."[11]

## నజరేతుకు తిరిగి వచ్చుట (2:19-23)

**19హేరోదు చనిపోయిన తరువాత ఇదిగో ప్రభువు దూత ఐగుప్తులో యోసేపునకు దర్శనమందు ప్రత్యక్షమై 20-నీవు లేచి, శిశువును తల్లిని తోడుకొని, ఇశ్రాయేలు దేశమునకు వెళ్లుము; 21శిశువు ప్రాణమును తీయజూచుచుండినవారు చనిపోయిరని చెప్పెను. అప్పుడతడు లేచి, శిశువును తల్లిని తోడుకొని ఇశ్రాయేలు దేశమునకు వచ్చెను. 22-23అయితే అర్కెలాయు తన తండ్రియైన హేరోదునకు ప్రతిగా యూదయదేశము ఏలుచున్నాడని విని, అక్కడికి వెళ్ల వెరచి, స్వప్నమందు దేవునిచేత బోధింపబడినవాడై గలిలయ ప్రాంతములకు వెళ్లి, నజరేతును ఊరికి వచ్చి అక్కడ కాపురముండెను. ఆయన నజరేయుడనబడునని ప్రవక్తలు చెప్పినమాట నెరవేరునట్లు (ఈలాగు జరిగెను.)**

**వచనము 19.** కొంత కాలము తరువాత, **ఒక దేవదూత ఐగుప్తులోనున్న యోసేపుకు, స్వప్నములో** ప్రత్యేక్షమయ్యాడు. హేరోదు మహారాజు మరణించినప్పుడు ఈ ప్రత్యక్షత కలిగినది. హెచ్. లియో బోల్స్ హేరోదు మహారాజు మరణ సమయము గూర్చి ఇలా వ్యాఖ్యానించాడు:

> హేరోదు రాజు పస్కా పండుగకు ముందు 750వ సంవత్సరములో రోమా పట్టణము నిర్మింపబడిన పిమ్మట, మనము మన కాలమును (క్రీ.పూ. 4) లెక్కించు తేదికి నాలుగు సంవత్సరములు మునుపు, యెరికో పట్టణంలో మృతిచెందాడు. పస్కా పండుగ ఆ సంవత్సరము ఏప్రిల్ మాసము 12 తేదిన జరిగిందనియు, పస్కా పండుగకు ఏడు నుండి పదునాలుగు రోజుల ముందు హేరోదు మరణించాడనియు లెక్కలు వేయబడినది.[12]

హేరోదు మరణించినప్పుడు ఆయన వయస్సు డెబ్బది సంవత్సరములు, ఆయన ముప్పది ఏడు సంవత్సరములు పరిపాలించాడు. జోసీఫస్ ప్రకారము, హేరోదు బహు ఘోరంగా మరణించాడు. అది ఇలా వర్ణింపబడింది: పేగులన్నీ కుళ్లు పడిపోయినవి, అవయవములన్నీ కుళ్లిపోయినందువలన పురుగు పడినవి, శరీరములో ఎడతెరపిలేని ఈడ్పులు, శ్వాసయైతే అతనిని సమీపించినవారికి ఊపిరిసలపనీయని దుర్గంధములో నిండియుండినది.[13] లోకములో ఇంతటి దురదృష్టకరమైన దురవస్థను కలుగజేసిన దుర్మార్గుడైన వానికి ఇది సముచితమైన అంతమే.

ఆయన మరణించినప్పుడు యూదులు విలపించుటకు బదులుగా సంతోషిస్తారని హేరోదుకు తెలియును. ఈ హేతువునుబట్టియే, యూదుల నాయకులందరు ప్రాచీన కాలంలో గ్రీకు లేక రోమ్ దేశల్లో రథాలు లేక గుఱ్ఱాల పందెములు నిర్వహింపబడుచుండిన అండాకార క్రీడారంగంలో బందీలుగా మూయించి వేయబడవలెనని ఆజ్ఞాపించాడు. వారికి

పుష్టికరమైన భోజనము పెట్టవలెను, అడిగిన మరియు అవసరమైన సౌకర్యములన్నియు ఏర్పాటు చేయబడవలెను; కానీ ఆయన మరణ వార్త ప్రకటింపబడగానే, వారందరును ఉరితీయబడవలెను. ఏదిఏమైనా, ఆయన వేసికొనిన పైశాచికమైన ప్రణాళిక ఫలించలేదు. ఏలయనగా, యూదీయ నాయకులను హతమార్చుటకు కీరాయి సైనికులకు సంకేతించవలసి యుండిన ఇద్దరు, అనగా హేరోదు యొక్క సహోదరి సలోమి మరియు ఆమె భర్త అలెక్సాయు, సంకేతించుటకు బదులుగా వారు చెరసాల ద్వారములను తెరచి బందీలుగా బంధింపబడి యుండిన యూదీయ నాయకులందరిని స్వేచ్ఛగా విడిచిపెట్టారు, ఆయన మరణిస్తాడనగా ఐదు రోజులకు ముందు ఒక ఘాతుకమైన చర్యగా, హేరోదు – రోమా ప్రభుత్వ అనుమతితో – అంతిపేతురు, తన భార్య డోరిని ద్వారా ఆయనకు కలిగిన కుమారుడు, హేరోదుకు విరోధముగా ఆయనను దొంగచాటుగా హత్యచేయవలెనని కుట్ర పన్నినవాడు, చంపబడవలెనని హేరోదు ఆజ్ఞాపించాడు.[14]

హేరోదు మహారాజు మరణించినప్పుడు, అర్కెలాయు, మల్తేయకు పుట్టిన అతని కుమారులులో ఒకడు, ఒక రాజుకు చేయవలసిన ఘనమైన అంత్యక్రియలు తన తండ్రికి చేయునట్లు తగు శ్రద్ధ వహించాడు. హేరోదు దేహము ఊదారంగుబట్టలతో చుట్టబడినది, తలపై బంగారు కిరీటము ఉంచబడినది. ఆయన చేతిలో ఒక గట్టి బంగారు రాజదండము ఉంచబడినది, భూస్థాపన నిమిత్తమై ఆయన దేహముంచబడిన శవపేటిక మేలిమి బంగారుతో చేయబడి, లోపల వెలగల రాళ్లతో పొదగబడినది. శవపేటిక అసంఖ్యామైన తన కుటుంబ సభ్యులు, ఘనతకెక్కిన తన సైనికులు, మరియు సర్వ సైన్యము చేత చుట్టుముట్టబడి యుండినది. దారి పొడువునా ఐదువందల మంది బానిసలు పరిమళ తైలమును చల్లుచుండిరి. ఆయన భౌతిక కాయము యెరికొనుండి బేత్లెహేమునకు నైరుతి దిశగా మూడు మైళ్ల దూరములో నుండిన హెరొడియోమ్ వరకు మోసికొని తీసికెళ్లబడినది.[15] హేరోదు చేత నిర్మింపబడిన అనేక భోగభాగ్యాలతో నిండిన దుర్గములలో అదొకటై యుండినది. ఈ స్థలమందు త్రవ్వకములు చేపట్టబడి అనేక సంవత్సరములు గడిచిన తరువాత, వారు హేరోదు సమాధిని అతని శిలానిర్మిత శవపేటికతో సహా కనుగొన్నారని ఇశ్రాయేలు దేశ పురావస్తు శాస్త్రజ్ఞులు అధికారపూర్వకంగా ఘోషించారు. ఏదిఏమైనా, ప్రాచీన కాలములలో, విలువైన వస్తువులు లూటీ చేయబడినవి, శిలానిర్మిత శవపేటిక పగులగొట్టబడినది, అతని అస్థిపంజరము తొలగింపబడినది.

**వచనము 20.** యోసేపు తన కుటుంబముతో కూడ **ఇశ్రాయేలు దేశమునకు** తిరిగి వెళ్లవలెనని దేవదూత యోసేపుకు ఆదేశములు జారీ చేశాడు. **శిశువు ప్రాణము తీయజూచుచుండినవారు చనిపోయిరని** కూడ దూత యోసేపుకు తెలియజెప్పాడు. హేరోదు మరణించాడు గనుక, యిక మీదట అతడు యేసునకు ఎవ్విధంగాను ఎదిరింపు గాని, బెదిరింపుగాని అయియుండడు. దేవదూత భాష గతంలో మోషేకు తెలుపబడిన మాటలను జ్ఞప్తికి తెచ్చుచున్నది: “నీ ప్రాణమును వెదకిన మనుష్యులందరు చనిపోయిరి, గనుక ఐగుప్తుకు తిరిగి వెళ్లుము” (నిర్గమకాండము 4:19).

**వచనము 21.** ఇంతకు మునుపటి రెండు సందర్భములలో చేసినట్లే (1:24, 25; 2:14, 15), **యోసేపు** ఇప్పుడు కూడ దూత ఆదేశము మేరకు లోబడి వెంటనే కుటుంబ సమేతంగా ఐగుప్తు నుండి బయలుదేరాడు.

**వచనములు 22, 23.** వారు ఇశ్రాయేలు భూభాగములో ప్రవేశించినప్పుడు, **అతని తండ్రియైన హేరోదు స్థానములో అర్కెలాయు సింహాసమును అధిష్టించాడని** యోసేపుకు **వినబడినది.** అర్కెలాయు యూదులకు వాగ్దానము లిచ్చినప్పటికిని, అధికారంలోనికి రాగానే అతడు కూడ తండ్రిని మించిన తనయుడయ్యాడు, హేరోదును మించిన దయమాలినవాడయ్యాడు. అతని తండ్రి యొక్క వీలునామానుబట్టి అర్కెలాయుకు "రాజు" అను బిరుదు ప్రధానము చేయబడినది. ఏదిఏమైనా, యూదులు కైసరు ఔగుస్తుకు వారి అసంతుష్టిని తెలియజేసికొనినప్పుడు, ఆయనకు "నిర్దిష్ట ప్రజా పరిపాలకుడు" అని అర్థమిచ్చు, "ప్రాంతీయ పాలకుడు" అను బిరుదు ఇవ్వబడినది. అతనికి యూదయ, సమరయ, మరియు ఇదూమియ ప్రాంతములపై (దాదాపుగా తన తండ్రి రాజ్యములో సగభాగముపై), అధికారముండినది. అంతిపయ, హేరోదు యొక్క సమరయ దేశ భార్య మల్తేయ కుమారుడు, మరియు అర్కెలాయు సహోదరుడు, గలిలయ మరియు పెరియ ప్రాంతములనేలు "చతుర్థాదిపతి" గా నియమింపబడెను. రెండవ ఫిలిప్పు, యెరూషలేమునకు చెందిన క్లెయోపాత్రకు పుట్టిన హేరోదు కుమారుడు, త్రకొనియ, ఇతూరియ, గౌలనియ, బతనియ, మరియు ఔరనియ ప్రదేశములనేలు "చతుర్థాధిపతి" అనగా "చతుర్థాంశ భాగమునేలువాడు" అని అర్థము (లూకా 3:1 చూడుము).[16] "రాజు," "నిర్దిష్ట ప్రజా పరిపాలకుడు," మరియు "చతుర్థాతిపతి" అను పదములు వాటి ప్రాముఖ్యతలో అవరోహణ వరుసక్రమ ప్రకారము రాయుబడినవి.

హేరోదు యింకా బ్రతికి యుండగానే, బంగారముతో ఒక భారీ గ్రద్ద విగ్రహాము, రోమా ప్రభుత్వ అధికారమునకు చిహ్నముగా నుండినది, దేవాలయము యొక్క సింహా ద్వారము నొద్ద నిలువబెట్టించబడవలెనని ఆయన ఆజ్ఞాపించాడు. ఇద్దరు ముఖ్యమైన యూదీయ రబ్బీలు, యూదయ మరియు మత్తీయ, ఈ గ్రద్ద విగ్రహామును పగులగోట్టి ధ్వంసము చేయవలెనని వారి విద్యార్థులను ప్రోత్సాహించారు. ఈ విద్యార్థులలో కొందరు దేవాలయము యొక్క పైకప్పు మీదికెక్కి ఆ గ్రద్దను అక్కడ నుండి తొలగించి దానిని నాశనము చేయుటకు ప్రయత్నించారు. ఆ సమయంలో పట్టబడిన విద్యార్థులకు తేలికయైన శిక్షాప్రధానం చేయబడింది. కానీ రబ్బిలు సజీవదహనం చేయబడ్డారు.[17] హేరోదు మహారాజు మరణించిన తరవాతి పస్కా పండుగ సమయంలో, గౌరవనీయులైన ఈ ఇద్దరు రబ్బీలు మరణమునకు విరోధముగా యూదులలో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లను అణచివేయుటకు అర్కెలాయు అతి కఠినమైన చర్యలు చేపట్టాడు; ఈ ప్రకియలో, మూడు వేల మంది యూదులు చంపబడ్డారు.[18] ఇటువంటి ఇతర భయంకరమైన కార్యములు జరిగిన తరువాత, యూదులు కైసరు ఔగుస్తు నొద్ద వారి అసంతుష్టిని విన్నవించుకొన్నారు. చిట్టచివరకు, తొమ్మిది సంవత్సరములు క్రూర పరిపాలన తరువాత, అర్కెలాయు ప్రాచీన ఫ్రెంచి దేశములోని వియెన్నెకు దేశబహిష్కృతుడు గావింపబడినాడు, ఆయన అక్కడ క్రీ.శ. 6లో మరణించాడు.[19] ఆయన మరణాంతరము, ఆయన పరిపాలించిన భూభాగము రోమా ప్రభుత్వ పరిపాలనా ప్రదేశముగా మార్చబడి, ప్రభుత్వ పక్షమున నియమింపబడిన అధికారి చేత ఏలబడినది. కురేనియు కపొనియు, ఏంబివియూ, ఏనియు రూపు, వలేరియు గ్రేటస్, ఫేలిక్సు, మరియు ఫేస్తు – వీరందరు ఇదే హోదాలో అధికారులై యుండిరి; కానీ వీరందరిలో యేసు సిలువవేయబడవలెనని తుది తీర్పు నిచ్చినవాడు పొంతి పిలాతు అత్యంత ప్రసిద్ధిగాంచినవాడై యుండెను (మత్తయి 27:2, 11–26).

యోసేపు నిస్సందేహాముగా అర్కెలాయు యొక్క ద్రోహాము గూర్చి వినియుంటాడు గనుక - సమంజసముగానే - బేత్లెహేమునకు తిరిగి వచ్చుటకు **భయపడి యుండును**. ఆయన యూదయ దేశమును విడిచివెళ్లవలసినదని **దేవుడు స్వప్నమందు** యోసేపును హెచ్చరించాడు. ఆ కాలంలో, ఆయన గలిలయకు, అంతిపయు పరిపాలించుచుండిన ప్రదేశమునకు, వెళ్లవలసినదని కూడ తెలియజెప్పబడినట్లు అగుపించుచున్నది. హేరోదు మహారాజు కుమారుడు సమాధానమును అతిగా అభిలాషించినవాడని అంగీకరింపబడెను. అంతిపయ గూర్చిన బోల్స్ ఇలా చెప్పుచున్నాడు,

> అతడొక వ్యత్యాసమైన వ్యక్తియై యుండెను గనుక అతని సహోదరుడు అర్కెలాయు కంటె అతి సామాన్యమైన విధానములో పరిపాలించుచుండిన అధికారియై యుండెను. ఈ సమయంలో హేరోదు అంతిపయ మరియు అర్కెలాయు బద్ధశత్రువులై యుండిరి; గనుక యోసేపుకును తన కుటుంబముకును ఇదొక అత్యంత అనుకూల సందర్భమై యుండినది.[20]

గలిలయ, పాలస్తీనా యొక్క ఉత్తర విభాగమై యుండెను. ఇది విద్యాభ్యాసము చేసి విజ్ఞులు కావాలని ఆతురపడిన ప్రజలుండిరని పేరుపొందిన ప్రదేశము కాదు, కానీ దాని యొక్క సహజ వనరుల వాతావరణము అత్యంత అనుకూలముగా ఉండినందువలన అది మత్స్యకారులకును వ్యాపారస్తులకును ప్రధాన కేంద్రమయ్యింది. అంతమాత్రమేగాక, ఈ ప్రదేశములో అన్యజనులు బహు బారీ సంఖ్యలో నివసించుచుండిరి (4:15). ఈ ప్రాంతములో నివసించుచుండిన యూదులు ప్రఖ్యాతిగాంచిన రబ్బీల చేత నిరసించబడుచుండిరి, కాబట్టి, అందుమూలమున వారిని ఇతరులు సహితము వారి దారినే అనుసరించుచు నిరసించుచుండిరి (యోహాను 7:52; అపొస్తలుల కార్యములు 2:7; 4:13 చూడుము). జోసీఫస్ చెప్పుచున్న దాని ప్రకారము, గలిలయ ప్రాంతములో 240 పట్టణములు మరియు పల్లెలుండినవి మరియు ప్రతి ఒక్క చోట పదిహేను వేల మంది కంటె ఎక్కువ మంది పౌరులుండిరి.

యోసేపు తన కుటుంబముతో **నజరేతు**లో స్థిరపడ్డాడు, అది బహుశా ఈ ఇరువురి (మరియ మరియు యోసేపు) స్వస్థలమై యుండవచ్చును (లూకా 2:4 చూడుము). **ఆయన నజరేయుడనబడునని ప్రవక్తలు చెప్పిన మాట నెరవేరునట్లు ఈలాగు జరిగెను**. మత్తయి, "ప్రవక్త" అని ఏకవచనమునకు బదులుగా "ప్రవక్తలు" అని బహువచనములో రాయచున్నాడు. పాత నిబంధనలోని ఏ వాక్యభాగములోను ఈ ప్రవచనము లేదు, మరియు దాని యొక్క కచ్చితమైన మూలాధారమేమై యున్నదో తెలియదు. ఈ ప్రవచనము యొక్క మూలము గూర్చి కనీసము మూడు వివరణములున్నవి.

మొదటిది, "నజరేయుడు" అను మాట నాజీరు వ్రతముతో సంబంధము కలిగియున్నదని కొందరనుకొనుచున్నారు (సంఖ్యాకాండము 6; న్యాయాధిపతులు 13:5-7). ఏదిఏమైనా, దేవునికి యేసు పరిశుద్ధుడై యుండినప్పటికిని, ఆయన నాజీరుచేయబడినవాడు కాదు. ఆయన "తినుచును త్రాగుచును" వచ్చును (11:18, 19) గనుక మృతులైనవారిని ముట్టుకొనుటకు ఆయన సంకొచించలేదు (మార్కు 5:35, 41; లూకా 7:14). ఇంతేగాక, యేసు తన తల వెంట్రుకలను పొడుగ్గా పెంచుకొన్నాడని చెప్పుటకు ఋజువువేదియును లేదు.

రెండవది, యెషయా 11:1లో రాయబడి యున్నట్లు, "నజరేయుడు" అను మాట యెష్షయి మొద్దు నుంచి మొలుచు చిగురుకు ఒక రిఫరెన్సు అయియుండవచ్చునని ఇతరులు

సూచించుచున్నారు. "నజరేయుడు" అను పదము వలెనే హెబ్రీ భాషలో నున్న పదమునకు (*netser*), "చిగురు" లేక "కొమ్మ" అని అర్థము. ఇది శబ్దచమత్కారమైనట్లయితే, మొదటి రెండు అధ్యాయాలు యేసు దావీదు సంతతివాడను రిఫరెన్సు చేత చుట్టుముట్టబడును (1:1; 2:23).

మూడవది, యేసు తృణీకరింపబడి అపహాసింపబడునను నానావిధ ప్రవచనములను గ్రంథకర్త మిళితము చేయుచుండెనని అనేక మంది వ్యాఖ్యానకర్తలు సూచించుచున్నారు (కీర్తనలు 22:69; యెషయా 49:7; 53:2, 3, 8; దానియేలు 9:26). యేసు అందరి చేత తృణీకరింపబడిన నజరేతు పట్టణ వాసి యని పేరుగాంచి యుండెను (యోహాను 1:45, 46), గనుక ఆయన నిజముగానే మనుష్యుల చేత అపహాసింపబడెను (మత్తయి 12:24; 27:21–23, 63; లూకా 23:11; యోహాను 1:11; 5:18; 6:66; 9:22).

చివరి వివరము అత్యంత సమంజసముగా నున్నది. మత్తయి సువార్తలో నున్న నానా విధమైన ఇతర నెరవేర్పుల సూత్రముల వలె గాక, 2:23లో నున్న నెరవేర్పులో (సూత్రములో) "అని చెప్పబడిన" అని ASVలో అనువదింపబడినట్లు (NASBలో అనువదింపబడక విడచిపెట్టబడినది) క్రియా పదము (*legontos*) లేదు ఈ మినహాయింపు మరియు "ప్రవక్తలు" అను బహువచనము గూర్చి ఆర్. టి. ఫ్రాన్స్ ఇలా చెప్పుచున్నాడు,

> "ఆయన నజరేయుడనబడును" అను మాటలు ఒక నిర్దిష్టమైన వాక్యభాగములోని ఒక ఉల్లేఖనముగా ఎంచబడుటకు ఉద్దేశింపబడలేదు, కానీ ప్రవచనాత్మకమైన నిరీక్షణకు సంబంధించిన ఒక ఇతివృత్తము యొక్క సారాంశమై యున్నదని ఇది సూచించుచున్నది. ఈ విధంగా నజరేతు యొక్క మరుగులో వినయముగలవాడును తృణీకరింపబడినవాడునైన మెస్సీయా గూర్చిన పాత నిబంధన సూచనలు నెరవేరుట మత్తయి గమనించాడని తెలియజెప్పబడుచున్నది.[22]

జాక్. పి. లూయిస్ ఇలా రాయుచున్నాడు, "ఉల్లేఖనము యొక్క నేపథ్యమేదైయున్నప్పటికిని, 'నజరేయుడు' అను పదము క్రొత్త నిబంధనలో 'నజరేతు నుండి వచ్చినవాడని' అర్థమిచ్చుచున్నట్లు అగుపించుచున్నది."[23] ఈ అధ్యాయము బేత్లెహేముతో, అనగా క్రీస్తు జన్మస్థలముతో (2:1) మొదలై, నజరేతుతో, అనగా ఆయన సొంత స్థలముతో ముగియుచున్నది (2:23). యేసు, ఆయన పుట్టిన మరియు ఆయన ఎదిగిన సంవత్సరములలో, పాత నిబంధనలోని ప్రవచనములు నెరవేర్చాడని ఇది చూపించుచున్నది.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### అది క్రీస్తు జయంతి తరువాతి దినము (2:13–18)

క్రీస్తు జయంతి కాలము సంవత్సరములోని ఒక అద్భుతకరమైన సమయమై యున్నది. అట్టి సందర్భములో ప్రపంచ నలుమూలలోను వేడుకలు జరిపించుకొనబడుచుండును. మనలో ఉండవలసిన ప్రేమ, సంతోషము, భూమి మీద నెలకొల్పబడవలసిన సమాధానము, మరియు సాటి మానవుల యెడల ఉండవలసిన సౌహర్దముపై దృష్టి కేంద్రీకరింపబడుతొంది. ప్రజల్లో ఉదారతా స్ఫూర్తి ఎక్కువౌతుంది.

క్రీస్తు జయంతి తరువాతి రోజున మీ ఇంటిలో ఎటువంటి వాతావరణము నెలకొని యుంటుంది? చిందరపందరగా నున్న బహుమానములు ఖాళీ పెట్టెలు, అవి చుట్టబడి యుండిన రంగు రంగుల కాగితములు చింపివేయబడి యుండుట, మెడకు కట్టుకొనబడు చదునైన చిన్న టై మొదలగు వాటి గూర్చి కొంచము సేపు ఆలోచన చేయుము. చల్లని పానీయములు త్రాగిన తరువాత పారవేయబడిన ఖాళీ డబ్బాలు కుప్పను తొలగించుటకు ఎవరూ పట్టించుకొనడంలేదు. తరుచగా, క్రీస్తు జయంతికి ముందుండిన స్ఫూర్తి నెమ్మది నెమ్మదిగా బలహీనమగుచుండును గనుక సహానాన్ని కొల్పోయిన ప్రజలు వారాశించినట్లుగా, లేని బహుమానములను తిరిగి ఇచ్చివేయుటకు అంగళ్ల ముందు బారులు తీరిన వరుసలో ఎంత సేపైనా నిలువబడి యుందురు. మనము క్రీస్తు జయంతి స్ఫూర్తిని మనము సంవత్సరం పొడుగునా సజీవంగా ఉంచుకొనగలిగినట్లుయితే, అది ఎంతో అద్భుతకరమైన ఆనందానుభవమై యుండదా?

వాస్తవమునకు డిసంబరు 25వ తేది క్రీస్తు జయంతి అసలు దినము కాదు, అట్లయినను ప్రపంచమంతా అనేకులు ఈ తేదిని క్రీస్తు జయంతిని వేడుకగా జరుపుకొనుచుందురు. ఈ రోజుల్లో వీరు తమ దృష్టిని కేంద్రీకరించు విషయమును మనము మనకు ప్రయోజనకరముగా నుండునట్లు ఉపయోగించుకొనవలెను. యేసు క్రీస్తు పుట్టిన తరువాతి రొజున/రొజుల్లో ఏమి సంభవించినదో అని యోచించుటకు మనము ఎప్పుడైన కొంచము సమయము తీసుకొంటామా? యేసు పుట్టిన తరువాతి రొజుల్లో సంభవించిన సంఘటనలను మనము జ్ఞాపకముంచుకొందాము. క్రీస్తు పుట్టాడన్న సంతొషమును మనము సంవత్సరం పొడువునా కలిగియుండుటకు ప్రయాసపడవలసి యున్నది.

### తలిదండ్రుల ప్రత్యేక పాత్ర (2:13-15, 19-23)

వారి కుమారుడైన యేసును కాపాడుచు పెంచి పెద్దవాని చేయు విషయంలో యోసేపు మరియు మరియ ఒక అత్యంత ప్రాముఖ్యమైన పాత్ర వహించవలసి యుండిరి. మెక్‌గార్వే ఇలా రాయుచున్నాడు,

> పిల్లవానికి ఎదురయ్యే సమస్త ప్రమాదములలోను వానిని కాపాడుచు, వానిని పెంచి పెద్దవానిని చేయుట దేవుడు వారిని పిలిచిన పనియై యుండినది, గనుక వారియందుంచబడిన పరలోక నమ్మకమును వారు అత్యంత విశ్వసనీయముగా నిర్వర్తించారు మరియు నెరవేర్చారు. ఏదిఏమైనా, ఇటువంటి పరిస్థితిలో ఉంచబడినది తల్లిదండ్రులైన మరియ మరియు యోసేపు మాత్రమే కాదు; పిల్లలు ఉండవలసిన ఉజ్వలమైన ఉనికిలో వారిని ఉంచుచు వారిని సరైన రీతిలో పెంచుట ద్వారా తరుచుగా జీవితంలో తలిదండ్రులు వారి అత్యంత గొప్ప పనులను చేసినవారౌదురు.[24]

బైబిలులో పేర్కొనబడినట్లు, వారి పిల్లలను ప్రశంసాయోగ్యమైన పిల్లలునుగా పెంచి పెద్దవారిని చేసిన దైవభక్తిగల తలిదండ్రులెవరనగా, (1) మోషే, అహరోను, మరియు మిర్యాము తలిదండ్రులు - అమ్రాము మరియు యోకెబెదు (నిర్గమకాండము 2:1-10; సంఖ్యాకాండము 26:59); (2) సమూయేలు తలిదండ్రులు - ఎల్కానా మరియు హన్నా (1 సమూయేలు 1:1-2:11); (3) బాప్తిస్మమిచ్చు యోహాను తలిదండ్రులు - జెకర్యా మరియు ఎలీసబెతు (లూకా 1); (4) తిమోతి యొక్క అవ్వ మరియు అమ్మ - లోయి

మరియు యునీకె (2 తిమోతి 1:5; అపొస్తలలు కార్యములు 16:1-3 చూడము).

వారి పిల్లలను ప్రభువులో (ఎఫెసీయులుకు 6:4; తీతు 2:3-5) పెంచి పెద్దచేయుట నేటి క్రైస్తవ తలిదండ్రులకు ఒక గొప్ప సవాలై యున్నది. భౌతిక మరియు అధ్యాత్మిక అపాయములు నుండి పిల్లలు కాపాడబడవలసినవారై యున్నారు. పిల్లలు సరైన రీతిలో పుష్పించుటకు, వారికి శిక్షణ, ప్రోత్సాహము, మరియు క్రమశిక్షణ సమతౌల్య పాళ్లలో అవసరమై యున్నది. వారికి దైవ సత్యములను నోటి మాటలు ద్వారా మరియు దైవభక్తిగల మాదిరి ద్వారా ఉపదేశించవలెను. యేసు క్రీస్తునందు విశ్వసించి దేవుని రాజ్యములో సేవ చేయు పిల్లలను పెంచి పెద్దవారిని చేయుట జీవితంలో తలిదండ్రులు సాధించగల అత్యంత గొప్ప సాధింపు మరియు ఆశీర్వాదమునై యున్నది.

డేవిడ్ స్ట్యూవర్ట్

---

సూచనలు

[1]Philo *Flaccus* 6. [2]Leon Morris, *The Gospel According to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 43. [3]J. W. McGarvey, *The New Testament Commentary*, vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 29. [4]Donald A. Hagner, *Matthew 1-13,* Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 36. [5]Douglas R. A. Hare, *Matthew,* Interpretation (Louisville: John Knox Press, 1993), 15-16. [6]ఈ కథల మధ్యగల అదనపు సమాంతరములు కొరకు Hagner, 34 చూడుము. [7]McGarvey, 29. [8]Hagner, 37. [9]దానికి బదులుగా, కొందరు విద్వాంసులు యిర్మీయా 31:15లో గల ఉల్లేఖనమును ఉత్తరమున ఉండిన తెగలకు చెందిన ప్రజల అష్షూరు చెరతో (క్రీ.పూ. 722) ముడిపెట్టుదురు. రాహేలు కూడ యోసేపు తల్లి యనియు, ఇశ్రాయేలులోని రెండు ప్రముఖ్యమైన తెగలు అతని కుమారులే, అనగా ఎఫ్రాయిము మరియు మనష్షే అనియు వారు సూచించుదురు. ఇంతేగాక, "ఎఫ్రాయిము" అను మాట ప్రవచనములోని దగ్గరి సందర్భములలో అగుపించుచున్నది (యిర్మీయా 31:18, 20). [10]James E. Smith, *Jeremiah and Lamentations,* Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1972), 522.

[11]Hare, 16. [12]H. Leo Boles, *A Commentary on the Gospel According to Matthew* (Nashville: Gospel Advocate Co., 1936), 58. [13]Josephus *Antiquities* 17.6.5. [14]Ibid., 17.6.5; 17.8.2; 17.7.1. [15]Ibid., 17.8.3. [16]Ibid., 17.11.4. [17]Ibid., 17.6.2-4. [18]Ibid., 17.9.3. [19]Ibid., 17.13.2. [20]Boles, 61.

[21]Josephus *Life* 45; *War* 3.3.2. [22]R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 88-89. [23]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 52. ఆయన మత్తయి 2:23; 21:11; 26:71; లూకా 18:37; యోహాను 1:45, 46; 18:5, 7; 19:19; అపొస్తలుల కార్యములు 10:38; 24:5 మొదలుకొని సూచించాడు. [24]McGarvey, 29.